


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -178-

(11 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**జరిగే మోసాలు డబ్బు కోసమే** జరుగుతూ వుంటాయి. తక్కినవి స్త్రీలకోసం, పదవుల కోసం. తమాషాకు మోసాలు చేసే వారు ఏ మూలనో ఒకరిద్దరుంటారేమోగాని లెక్కకు రారు.

అయిదు పైసల దగ్గరనుంచి ఎంత పెద్ద మొత్తం వరకైనా ఈ మోస ప్రయోగాలుంటాయి. మోసం అలవాటైన తర్వాత దానికో హద్దు అంటూ వుండదు. కూరలు కొంటుండగా వాటిలోకి చూడకుండా రెండు పుచ్చకాయలు తోసి పంచికలో గ్రుమ్మరించడం – ఒక చిన్న రకం మోసమే అయినా పెద్ద అలవాటుగా మారిపోతుంది.

వ్యాపారాలలో ఇదివరకటి రోజుల్లో మోసం చెయ్యడానికి సంకోచించేవారు. చేసిన తర్వాత బయటపడుతుందేమోనని భయపడేవారు. ఇప్పుడలాటి పరిస్థితులన్నీ మారిపోయినాయి. బహిరంగ మోసం, మోసంలో సవాల్ అని చెపుతూ మోసం.

"ఏమిటయ్యా ఈ విషయంలో అలా మోసం చేసావు?" అని నోరు తెరిచి అడిగితే "నీ అదృష్టం బాగుంది. నిన్న వచ్చినవాళ్ళనింకా ఏడ్పించి పంపాను. అంతదూరం పోవడానికి వాళ్ళ మనస్సు ఒప్పలా. దానికి సంతోషించు" అంటాడు గాని తగ్గి మాట్లడడు, సిగ్గుపడడు.

దేశంలో మోస పరిశోధన శాఖలున్నాయి. వారెంత తీవ్రంగా పరిశీలిస్తున్నారు. కాని ఎంతమంది హృదయాలలోనో దూరి, దుర్మార్గ లక్షణాలు కల్పిస్తున్న ఈ మోస పిశాచాలను పట్టి బయటికి లాగి ఏ ఉత్తర ధృవానికో బట్వాడా చెయ్యాలంటే ఎవరి తరం?

తెల్లవారి లేచిన తర్వాత ప్రతివారూ "ఇవ్వాళ ఎవరి మోసంలో పడతామో జాగ్రత్తగా వ్యవహరించాలి, జాగ్రత్తగా మాట్లాడాలి" అనుకోవడం అవసరమవుతోంది.

రోడ్డు మీద ఎవరైనా పరిచయం లేని వ్యక్తి కనిపించి పలకరించినప్పుడు ఎక్కడలేని అనుమానం భయం ఏర్పడుతోంది. "ఏం నా పేరడుగుతున్నావు? ఏం కావాలి?" అంటే.

"ఏం లేదు.... తమరిని ఎక్కడో చూచినట్లున్నాను... బాగా జ్ఞాపకం.. అందుకని అడుగుతున్నా. ఫలానా వీధి కాదు బాబూ మీది?" అంటారు.

"వీధి. చిరునామా అంతా వీడికెందుకో?" అనే అనుమానం వస్తుంది.

అసలు బయటికి వెళ్ళినప్పుడు పేరు, చిరునామా, సంతానం, సౌభాగ్యం వగైరాలన్నిటినీ పూసగుచ్చినట్లు చెప్పడం మనవాళ్ళకు ఆచారం. అవతల వాళ్ళు కూడా వాళ్ళ సంక్షిప్త కథ చెప్పేవారు.

రైళ్ళల్లో, బస్సుల్లో, హోటళ్ళలో సినిమాహాలులు వగైరాలలో, ఇలాటి పరస్పర పరిచయాలు మామూలుగా ఇప్పటికీ జరుగుతూనే వుంటాయి. వీటిని కూడా తగ్గించడం చాలా అవసరమనిపిస్తోందీనాడు. అసలు పేరు దాచి మరో పేరు ఏదైనా చెప్పడం మంచిది. అలాటి సందర్భాలలో తడుముకోకుండా ఒకటి, రెండు అదనపు నామధేయాలు ఏర్పాటు చేసుకుని వుంచడం అవసరం.

పేరు మార్చి చెప్పాలి.. చిరునామా కూడా మార్చాలి. ఈ రోజుల్లో కులానికి అట్టే ప్రాధాన్యం లేదు గనుక అదే కూడా మార్చి చెపితే మరీ మంచిది. ఇలా చెప్పడం వల్ల కొంత వ్యాకులత తగ్గి పోతుంది.

అలాకాకుండా ధర్మంగా, మన భోగట్టా అంతా అతనికి సమర్పించి చిరునవ్వులు ఒలకబోసుకుని చక్కా వస్తే ఏదైనా మోసపు చెంపపెట్టు రగలవచ్చు. దానికి పట్టీ వేసుకుని, కాపు పెట్టుకుని ఎంతో అవస్థ పడవలసి రావచ్చు.

ఈ సందర్భంలో అలాటి చెంపపెట్టుకు సంబందించిన సంఘటన ఒకటి తెలియచేస్తాను. కొద్దికాలం క్రింద మా మిత్రుడొకడు, మద్రాసు నుంచి బెంగుళూరు వెళ్ళాడు. అక్కడ నుంచి ధర్మవరం రైలు ఎక్కడానికిగాను వచ్చి ఫ్లాటుఫారం మీద కూర్చున్నాడుట.

ఒక మోస ప్రవీణుడు ప్రక్కన చేరాడు. కుశల ప్రశ్నలు ప్రారంభించాడు. మావాడు అన్నీ చెప్పాడు. తన భోగట్టాలో ఆపి వేయకుండా మద్రాసులో తన అన్న గదిపేరు, చిరునామా కూడా అందించాడు. వాడి త్రోవన వాడు వెళ్ళిపోయాడు.

మర్నాడు అన్నగారికి హుబ్లీ నుంచి టెలిగ్రాఫ్ మనియార్డరు పంపించాడు. మర్నాడు తమ్ముడు సుఖంగా ధర్మవరానికి చేరినట్లు ఉత్తరం వచ్చింది.

దానికి అన్నగారు వ్రాశాడు "అసలు హుబ్లీ ఎందుకు వెళ్ళారు. బెంగుళూరులో దిగాల్సిందిగదా.. డబ్బెలా పోయింది?" అని తమ్ముడు వ్రాశాడు "డబ్బు పోలేదు ధర్మవరం ఎకాఎకినే వచ్చాను" అని తర్వాత మోసం జరిగిందని నిర్ణయమైంది.

బెంగుళూరులో తను వంశవృక్షం తిరగవేసిన మాట తమ్ముడికి గుర్తుకు వచ్చింది. ఆ విషయం అన్నగారికి వ్రాశాడు. మనియార్డరు రసీదు మాత్రం రాలేదు చాలాకాలం. ఆ మోసకారి ఏం మెస్మరిజం చేశాడో..

ఈ వ్యాసం ఇంతవరకూ వ్రాసి కూరలకోసం మార్కెట్‌కు వెళ్ళాను. అక్కడ ఒక కూరల దుకాణం దగ్గర, ఒక ఏడెనిమిదేళ్ళ అమ్మాయి ఏడుస్తోంది. అందరూ తప్పుకుంటున్నారు. ఆ పిల్ల బళ్ళోకి వెడుతుంటే, ఎవడో కనిపించి 'మీ అమ్మమ్మ కొత్త చొక్కా కుట్టిస్తానంటోంది. మిషన్ దగ్గర కొలతలివ్వాలిట' రమ్మంది" అని తీసుకుని వెళ్ళాడుట.

అలా చెప్పి ఎక్కడికో తీసుకువెళ్ళి కాళ్ళకు వున్న ముప్పయి రూపాయిలు ఖరీదు చేసే పట్టాలు తీసుకుని వదిలి పారిపోయాడుట. ఆ పిల్ల ఏడుస్తూ వచ్చింది తండ్రి దుకాణం దగ్గరికి.

అక్కడ వాళ్ళందరూ పిల్లను అడుగుతున్నారు "ఎక్కడ తీసుకున్నాడు పట్టాలు. ఆ ఇల్లు గుర్తుపట్టగలవా? మనిషిని గుర్తుపట్టగలవా?" అని.

అది విని తండ్రి అంటున్నాడు "పోనియ్యండి బాబూ.. ఆ ముప్పయి రూపాయలతో వాడి పెళ్ళాం పిల్లల్ని పెంచుకోనివ్వండి. నా బిడ్డని నాకు వదిలాడు పుణ్యాత్ముడు... అదే పదివేలు" అని.

ఆస్తిపోయినా ప్రాణాలన్నా దక్కడం ఒక గొప్ప మేలుగా పరిణమిస్తోంది ఈ రోజుల్లో. సొమ్ము లాక్కుని ప్రాణాలు నైవేద్యం పెట్టడమనే ఆచారం ఒకటి తలెత్తింది పిదప కాలంలో.

మొత్తం మీద ప్రతి జీవీ "తస్మాత్ జాగ్రత్త" అనుకుంటూ బ్రతకాల్సి వచ్చింది. తెల్లారితే లక్షల కొలది. ఎన్నని వర్ణించగలం?

కాని ప్రజలు ఈ కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల్ని గురించి మాత్రం ఈసారి వివరిస్తాను.

Post your comments